### బీజేపీ,కాంగ్రెస్ నాయకులు

## బండి చక్రాలే..స్టీరింగ్ కాదు..

- బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగ బాలు



ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 28: పుట్టిన బిడ్డ తల్లి వద్ద ఉంటే ఎంత క్షేమమో.. తెచ్చుకున్న తెలంగాణ కేసీఆర్ వద్ద ఉంటే అంతే క్షేమమని బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగ బాలు అన్నారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదలజేశారు. తమిళనాడుకు చెందిన ఓ వ్యక్తిని ఒక సందర్భంలో కలిసినపుడు ఆ రాష్ట్రంలో జాతీయ పార్టీలకు చోటెందుకు లేదని ప్రశ్నించగా.. తమ ఇంటి బాధ వారికి ఎలా తెలుస్తుందని సమాధానమిచ్చారని తెలిపారు. జాతీయ పార్టీలో ఉండేది కూడా తమిళనాడు వాళ్లేనని తాను తిరిగి ప్రశ్నించగా.. మన వాళ్లు బండి చక్రాలే కానీ, స్టీరింగ్ కాదు కదా అని ప్రత్యుత్తరమిచ్చారని వివరించారు. మనలను పాలించేవాడు మనోడై ఉండాల్సిందేనని స్పష్టం చేశారు. అపుడే రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమాలతో ముందుకు వెళ్తుందని అభిప్రాయపడ్డారు. అందుకే తమిళనాడు రాష్ట్రం దేశంలోనే ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుందని పేర్కొన్నారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రం కూడా కన్నతండ్రి వంటి కేసీఆర్ పాలనలో ముందుకెళ్తోందని అన్నారు. తెలంగాణ ఏర్పాటు నినాదాలైన నీళ్లు, నిధులు, నియామకాలలో తొలి రెండింటిని కేసీఆర్ ప్రభుత్వం సాధించిందని గుర్తు చేశారు. నియామకాలు కూడా చేసేందుకు మూడోసారి బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు. అప్పుడే రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి, శాంతిభద్రతలు సజావుగా ఉంటాయన్నారు. లేనిపక్షంలో రాష్ట్రం అసమర్థ నాయకుల చేతిలో అధోగతి పాలయ్యే అవకాశం ఉన్నదని అన్నారు.

### పద్మారావుగౌడ్‌కే ఎమ్మార్పీఎస్‌ల మద్దతు



సికింద్రాబాద్ నియోజకవర్గంలో ఉన్న అన్ని కుల సంఘాలు తమకే మద్దతు తెలుపుతున్నాయని డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ అన్నారు.మంగళవారం రాత్రి సికింద్రాబాద్ టకారబస్తీలోని ఆయన నివాసంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కలసి మద్దతు ప్రకటించారు.బౌద్ధ నగర్,సీతాఫల్‌మండి డివిజన్లకు చెందిన నాయకులు గణేశ్‌మాదిగ,నవీన్‌కుమార్ పాల్గొన్నారు. –సికింద్రాబాద్,నవంబర్28:



డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్‌కు కొమురవెల్లి మల్లన్న చిత్రపటాన్ని బహూకరిస్తున్న లామినేషన్ షాపు నిర్వాహకుడు



తార్నాకలో ద్విచక్ర వాహన ర్యాలీలో పాల్గొన్న డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతరెడ్డి, తదితరులు

# అభివృద్ధికి కేరాఫ్ సికింద్రాబాద్

- భారీ మెజార్టీతో గెలిపించండి
- బైక్‌ర్యాలీలో పాల్గొన్న డిప్యూటీ స్పీకర్ బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్

సికింద్రాబాద్/ఉస్మానియా యూనివర్సిటీ /అడ్డగుట్ట, నవంబరు 28 : సికింద్రాబాద్ నియోజకవర్గాన్ని అభివృద్ధికి చిరునామాగా మార్చి, ప్రజలకు సంక్షేమ ఫలాలను అందించడంతో పాటు వారి అవసరాలను నిరంతరం తీర్చుతున్నామని డిప్యూటీ స్పీకర్, సికింద్రాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి తీగుళ్ల పద్మారావు గౌడ్ అన్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గంలో ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా మంగళవారం వివిధ ప్రాంతాల్లో కార్పొరేటర్లు, నేతల ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీలు నిర్వహించారు. డిప్యూటీ మేయర్ శ్రీలత రెడ్డి, కార్పొరేటర్లు హేమ, శైలజ, సునీత , ప్రసన్న లక్ష్మి , యువ నేతలు కిశోర్ కుమార్, కిరణ్ కుమార్, రామేశ్వర్ గౌడ్, త్రినేత్ర గౌడ్, సీనియర్ నేతలు మోతే శోభన్ రెడ్డి, కరాటే రాజు, కంది నారాయణ, శ్రీనివాస్ లతో పాటు పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు ఈబైక్ ర్యాలీల్లో పాల్గొన్నారు. ముందుగా సీతాఫల్‌మండి వద్ద నుంచి బైక్ ర్యాలీని పద్మారావు గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పద్మారావు గౌడ్ మాట్లాడుతూ సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో 50 సంవత్సరాల్లో చేపట్టని ఎన్నో పనులను కేవలం గడచిన పదేళ్ల వ్యవధిలోనే తాము చేపట్టామని తెలిపారు. సీఎం కేసీఆర్ సహకారం, మున్సిపల్ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు ప్రోత్సాహంతో అన్ని రంగాల్లో అభివృద్ధిలో సికింద్రాబాద్ నియోజకవర్గాన్ని ప్రథమ స్థానంలో నిలుపుతున్నామని తెలిపారు. 50 సంవత్సరాలుగా కేవలం కాగితాలకే పరిమితమై, నాయకుల వాగ్దానాలకే మితంగా నిలిచిన తుకారాం గేటు ఆర్‌యూబీ నిర్మాణ పనులు దాదాపు రూ.72 కోట్ల నిధులను వినియోగించి నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తెచ్చామని తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నుంచి రూ.30 కోట్ల ప్రత్యేక నిధులతో సీతాఫల్‌మండిలో ప్రభుత్వ ప్రైమరీ, హై స్కూల్, జూనియర్, డిగ్రీ కాలేజీ కొత్త భవనాలను నిర్మించే పనులు చురుకుగా సాగుతున్నాయని, సికింద్రాబాద్ లో జూనియర్, డిగ్రీ కాలేజిలు లేని లోటును తీర్చి, 50 ఏళ్ల స్థానికుల కలను నెరవేర్చడంతో పాటు కొత్త భవనాల నిర్మాణం పనులు కూడా చేపట్టడం విశేషమని తెలిపారు. అదే విధంగా సికింద్రాబాద్ పరిధిలో 10 స్కూళ్లను ఎంపిక చేసి రూ.50 లక్షల చొప్పున నిధులతో సదుపాయాలు కల్పిస్తున్నామని, అడ్డగుట్ట, జామై ఉస్మానియా, లాలాపేట ప్రభుత్వ స్కూల్ లలో సదుపాయాల మెరుగుకు, తరగతి గదుల నిర్మాణం, ఇతరత్రా సదుపాయాలకు రూ.3 కోట్ల నిధులను మంజూరు చేయడంతో పాటు తన సొంత నిధులతో పలు స్కూల్ లలో విద్యార్థులతో పుస్తకాలు, కంప్యూటర్ లను సమకూర్చామని తెలిపారు. పేద, మధ్య తరగతుల వారికి సీతాఫల్‌మండి మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్ ఉపయోగపడుతోందని, లాలాపేట, అడ్డగుట్టలో మరో రెండు ఫంక్షన్ హాల్స్ నిర్మిస్తున్నామని తెలిపారు. అందరికి ఉపాధి అవకాశాలు కల్పించే సెట్విన్ శిక్షణ కేంద్రం సీతాఫల్‌మండిలో స్థాపించామని, యువతీ యువకులకు ఉపయోగపడుతుందన్నారు.



కార్పొరేటర్ హేమతో కలసి బైక్‌పై ర్యాలీగా వెళ్తున్న డిప్యూటీ స్పీకర్,బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్

# కాంగ్రెస్, బీజేపీతో ఒరిగేదేమీ లేదు

- కేసీఆర్ పాలనలో అన్నివర్గాలకు న్యాయం
- మతతత్వ బీజేపీని చిత్తుగా ఓడించాలి
- మైనార్టీల సమావేశంలో బీఆర్ఎస్ అభ్యర్థి లాస్యనందిత

కంటోన్మెంట్, నవంబర్ 28: బీఆర్ఎస్‌తోనే కంటోన్మెంట్ నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమని, సీఎం కేసీఆర్ పాలనలో అన్ని వర్గాలకు సమన్యాయం జరుగుతుందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి లాస్యనందిత తెలిపారు. అన్ని వర్గాలను కడుపులో పెట్టుకుని కాపాడుకుంటున్న సీఎం కేసీఆర్‌కు సంపూర్ణ మద్దతు పలకాలన్నారు. గులాబీ పార్టీతోనే అన్నివర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. కాంగ్రెస్, బీజేపీ పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదని దుయ్యబట్టారు. మతతత్వ బీజేపీని చిత్తుచిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. గులాబీజెండాకు మద్దతు తెలిపి, తనను భారీ మెజార్టీతో గెలిపించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి లాస్యనందిత కోరారు. ఈ మేరకు సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గ పరిధిలోని ఒకటో వార్డు న్యూబోయిన్‌పల్లి పెన్షన్ లైన్‌లో మైనార్టీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి లాస్యనందిత, బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జక్కుల మహేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. ప్రజలంతా గులాబీజెండాకు సంపూర్ణ మద్దతు తెలపాలని లాస్యనందిత కోరారు.

**అభివృద్ధిని చూసి ఓటు వేయండి..**

కంటోన్మెంట్, నవంబర్ 28: రాష్ట్రంలో ఇంటిపార్టీగా ఉన్న బీఆర్ఎస్‌కు అందరూ అండగా నిలువాలని కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి లాస్యనందిత స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజలే తమ బాసులని తేల్చిచెప్పారు. కంటోన్మెంట్ నియోజకవర్గంలో అన్నివర్గాల ప్రజలున్నారని.. అందరికీ న్యాయం చేసేది ఒక్క గులాబీజెండా మాత్రమేనన్నారు. కేసీఆర్ పాలనలో జరిగిన సంక్షేమం దేశంలో ఎక్కడా జరగలేదని గుర్తుంచుకోవాలన్నారు. దివంగత ఎమ్మెల్యే సాయన్న చొరవతో కంటోన్మెంట్ నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పనులు జరిగాయని గుర్తుచేశారు. ప్రతివార్డులోనూ ఆయన చేసిన పనులు కళ్ల ముందు కనిపిస్తాయన్నారు. సాయన్న చేసిన అభివృద్ధిని చూసి, తనకు ఓటు వేయాలని కోరారు. ప్రజలందరి దీవెనలతో గెలిచేది తానేనని.. గెలిచిన తర్వాత సాయన్న బిడ్డగా ఆయన పేరును నిలబెడతానని మాట ఇచ్చారు.



బోయిన్‌పల్లి పెన్షన్‌లైన్‌లో మైనార్టీల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి లాస్యనందిత



కారు గుర్తుకే ఓటు వేయాలని మహిళను కోరుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి లాస్యనందిత



నదంమూరినగర్‌లో భారీగా హాజరైన బీఆర్ఎస్ శ్రేణులు



మహిళలతో కలిసి నినదిస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి లాస్యనందిత



ఓటు అభ్యర్థిస్తున్న బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ నాగేశ్